
## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు సన్మానం


హెచ్‌ఎసీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావును సన్మానిస్తున్న మహేందర్‌కుమార్

చిక్కడపల్లి, అక్టోబర్ 25 : స్వామి వివేకానంద సొసైటీ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు కొడిమాల మహేందర్ కుమార్ బుధవారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జగన్మోహన్ రావును కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్‌కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్‌రావు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను అభివృద్ధి చేసి మరింత గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

## 28న దుబాయ్‌లో సంగీత విభావరి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటుడు సాయికిరణ్

ముషీరాబాద్ అక్టోబర్ 25 : మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న 'స్వతంత్ర భారతికి తెలంగాణ సంగీత హారతి' పేరుతో దుబాయ్‌లో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకుడు బాపుశాస్త్రి తెలిపారు. బుధవారం దుబాయ్ గాన విభావరికి సంబంధించిన గోడ పత్రికను సినీ నటుడు సాయి కిరణ్‌తో కలిసి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం బాపుశాస్త్రి మాట్లాడుతూ గాయనీ, గాయకులు దివ్య, క్రాంతి, ప్రశాంతి, శ్వేత, ప్రగతి, మల్లేశ్, శశిధర్‌తో కలిసి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటేలా సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యోత్సవాలు ఉంటాయని ఆయన తెలిపారు. పలువురు ప్రముఖులకు సత్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


అల్పాహారం, పండ్లు పంపిణీ చేస్తున్న కందూరి కృష్ణ

చిక్కడపల్లి, అక్టోబర్ 25 : కందూరి కృష్ణ, సేట్ మానిక్ లాల్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందూరి కృష్ణ ఫౌండేషన్ అధ్యక్షుడు,బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కందూరి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. పేదలకు ఆదుకోవడం సామాజిక బాధ్యత అన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతి రోజూ 1700 మందకి అల్పాహారం, పండ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, బాగ్‌లింగంపల్లి చౌరస్తా తదితర ప్రాంతాల్లో పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో అగర్వాల్ ఫౌండేషన్ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, కందూరి కౌషిక్ అడ్వకేట్ గోవింద్ రావు, తదితరులు పాల్గొన్నారు

## నేడు విద్యుత్ మరమ్మతులు

ముషీరాబాద్, అక్టోబర్ 25: టీఎస్ఎస్‌పీడీసీ ఆజామాబాద్ డివిజన్ 11 కేవీ స్పెన్సర్స్, దాయర మార్కెట్, పార్శిగుట్ట ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం. విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెన్సర్స్, దాయర మార్కెట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు శివాలయం టెంపుల్, రాజా డీలక్స్, రేస్‌కోర్స్, ఎన్‌బీకే ఎస్టేట్ చర్చిగల్లీ, దాయర మార్కెట్, రిసాల, సాగర్ లాల్ ఆసుపత్రి, హరినగర్, తాడికాంపౌండ్ పరిసర ప్రాంతాల్లో , పార్శిగుట్ట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గంగపుత్ర కాలనీ, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, శ్మశానవాటిక, పార్శిగుట్ట పరిసర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# ముఠా గోపాల్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

**• పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జయసింహ పిలుపు**


బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, రాకేశ్‌కుమార్ తదితరులు


లడ్డూ సొంతం చేసుకున్న శివకుమార్, అభినందిస్తున్న బీఆర్‌ఎస్ నేత ముఠా జయసింహ

చిక్కడపల్లి,అక్టోబర్25 : బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మరోసారి గెలిపించాలని ఆ పార్టీ యువజన నాయకుడు ముఠా జయసింహ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ గాంధీనగర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం ముఠా జయసింహను దసరా పండుగ సందర్భంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ముఠా జయసింహ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, ఎమ్మెల్యే ముఠాగోపాల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, ఎంబీ కృష్ణ, భాస్కర్, ఆనంద్, చింతకింద నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి లడ్డూ వేలం పాట**

ముషీరాబాద్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాంనగర్ డివిజన్ జెమినీ కాలనీలో ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం లడ్డూ వేలం పోటాపోటీగా సాగింది. స్థానికులు అమ్మవారి లడ్డూ ప్రసాదం పోటీ పడగా గంట శివకుమార్ రూ. 3.90 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. అదేవిధంగా అమ్మవారి చీరెలను బోన్‌మోన్ సంతోష్ రూ. 76 వేలకు, మురళీ రూ. 73 వేలకు సొంతం చేసుకున్నారు. బీఆర్‌ఎస్ యువజన నాయ కుడు ముఠా జయసింహ, వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ నవీన్‌కుమార్, అధ్యక్షుడు బోన్‌మోన్ మహేశ్‌కుమార్ పాల్గొని లడ్డూ సొంతం చేసుకున్న శివకుమార్‌కు బంగారు కానుక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సతీశ్, అనిల్‌కు మార్, డింబా, శివప్రసాద్, మోహన్‌రాజ్, శ్రీకాంత్, నరేశ్, సురేశ్, బీఆర్‌ఎస్ నేత దీన్‌దయాళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

**• రౌడీషీటర్లకు ముషీరాబాద్ పోలీసుల ప్రత్యేక కౌన్సిలింగ్**


రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జాహంగీర్ యాదవ్

ముషీరాబాద్, అక్టోబర్ 25 : రౌడీషీటర్లు ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జాహంగీర్ యాదవ్ హెచ్చరించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం, ప్రలోభ పెట్టడం వంటివి చేస్తే సహించేదిలేదని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఆయన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని, ఎటువంటి కేసుల్లో ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిట్టి కేసు నమోదైనా పీడీ యాక్టు కేసు నమోదు, బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎప్పుడు పిలిచినా రావాలని, ఇళ్లు ఖాళీ చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**• బీఆర్‌ఎస్ నాయకులకు సూచించిన డిప్యూటీ స్పీకర్**

అడ్డగుట్ట, అక్టోబర్ 25 : తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పార్టీశ్రేణులకు సూచించారు. మెట్టుగూడ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు ఉపసభాపతి పద్మారావుగౌడ్‌ను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలను తెలియజేసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ ఎన్నికల్లో అవలంభించాల్సిన విధానాలపై వారికి పలు సూచనలను చేశారు. డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికెళ్లి పార్టీ చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్‌గౌడ్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు ఏఆర్ కృష్ణ, పార్టీశ్రేణులు ప్రకాశ్, గోవిందన్, కృష్ణ, లడ్డూ, వేణు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

సికింద్రాబాద్, అక్టోబర్ 25: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.(నవ రాత్రులు) తొమ్మిది రోజుల పాటు అమ్మ వారు వివిధ రూపాల అలంకరణలతో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవార్లు ఊరేగింపు సందర్భంగావివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

**మేడిబావిలో...**

మేడిబావి పోచమ్మ,ముత్యాలమ్మ ఆలయంలో ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు.భక్తులకు ఆలయ నిర్వాహకులు పరికిబండ కళాప్రకాష్ అన్ని ఏర్పాట్లు చేశారు.

**బీదలబస్తీలో..** బీదలబస్తీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్,మల్లేశ్, బాల్‌రాజ్‌గౌడ్, శేషగిరిరావు, బబ్బీ, దయా,శ్రీను,వివేక్,విద్యాసాగర్ ఏర్పాట్లు చేశారు.

**ఉప్పరి బస్తీలో..**

ఉప్పరిబస్తీలో జై భవానీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని బుధవారం నిమజ్జనానికి తరలించారు. అంతకుమందు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కళ్యాణ్, సాగర్, కిరణ్, గౌతమ్, టింకు, కార్తిక్, రవికిరణ్, శ్రీనాథ్, రాకేశ్, ఉమేశ్, రుతున్, నందు, సాయి, విజయ్, వాణి తదితరులు పాల్గొన్నారు.

## అలయ్ బలయ్‌లో కార్పొరేటర్


హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతో కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దపంతులు

చిక్కడపల్లి,అక్టోబర్ 26 : అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో గాంధీనగర్ కార్పొరేటర పావనీవినయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మిలను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## చట్టసభల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

చిక్కడపల్లి, అక్టోబర్ 25 : చట్ట సభల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో డీఎస్‌డీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షలకుపైగా జనాభా గల దివ్యాంగుల ఉన్నారని తెలిపారు. రాజస్తాన్ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఆయన వెంట డీఎస్‌డీ కోకన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, గౌస్ తదితరులు ఉన్నారు.

## ప్రొఫెసర్ ఉమామహేశ్వర్‌కు అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: ఉస్మానియా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఉమామహేశ్వర్ వనమాలను ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ ఇండియా (ఎస్‌ఏఈ ఇండియా) దక్షిణ భారతదేశ విభాగం అందించే లీడర్‌షిప్ అవార్డును ఆయన అందుకున్నారు. ఇటీవల చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈపురస్కారాన్ని స్వీకరించారు. ఎస్‌ఏఈ ఇండియా దక్షిణ భారతదేశ విభాగం పనితీరులో నాయకత్వ పాత్ర పోషించినందుకు ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌ఏఈ కాలేజియేట్ క్లబ్ స్థాపించి, దాదాపు పదేళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పలు వాహనాలు రూపొందించి బహుమతులు కైవసం చేసుకునేలా తీర్చిదిద్దారు. ఈ క్లబ్ ద్వారా జాతీయ స్థాయిలో పలు అవార్డులను సైతం విద్యార్థులు సాధించారు. గతేడాది సైతం ఈ అవార్డును ప్రొఫెసర్ ఉమామహేశ్వర్ గెలుచుకోవడం విశేషం. ప్రస్తుతం ఆయన ఎస్‌ఏఈ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.